క్లుప్తంగా

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు


స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

శనేశ్వరుడికి జలాభిషేకం

వాల్మీకిపురం : పట్టణ పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం శనేశ్వరుడికి జలాభిషేకం నిర్వహించారు. ఉదయం స్వామివారికి పసుపు, కుంకుమ, గంధంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మహా తైలాభిషేకం నిర్వహించి, మహాతైలాభిషేకం విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

పెద్దతిప్పసముద్రం: హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య, ఆకుల మల్లికార్జున తెలిపారు. గణపతి పూజ, పుణ్యావాచనం, పంచామృతాభిషేకం, మన్యు సూక్త పూర్వక తేనెతో అభిషేకం, రామతారక హోమం, పూర్ణాహుతి, ఆకు పూజ కార్యక్రమాలతో పాటు సాయంత్రం జరిగే హనుమంతుని శోభా యాత్రలో భక్తులందరూ పాల్గొనాలని సేవకులు కోరారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

కేవీపల్లె : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వైద్యసేవలందించాలని జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని జిల్లేళ్లమంద ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఎన్‌సీడీ, సీడీ సర్వేలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్‌కిరణ్, హెచ్‌ఈ మహమ్మద్ రఫీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ పాఠశాలల్లో ప్లస్‌టు విద్యను ప్రవేశపెట్టాలి

మదనపల్లె సిటీ : మున్సిపల్ పాఠశాలల్లో ప్లస్‌టు విద్యాను ప్రవేశపెట్టాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా హైస్కూల్ ప్లస్‌ను అమలు చేస్తోందన్నారు. మున్సిపల్ పాఠశాల్లో అమలు చేస్తే విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. స్కూల్ అసిస్టెంట్లను సీనియారీ ప్రాతిపదిక నియమించి వారికి గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు వేసవి సెలవుల్లో పూర్తి చేయాలన్నారు.

గడ్డివామి దగ్ధం

రామసముద్రం : గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి నిప్పుపెట్టారు. మండలంలోని ఊలపాడు పంచాయతీ బూసానికురప్పల్లె గ్రామానికి చెందిన మంజునాథ్‌కు, శ్రీనివాసులుకు గ్రామంలో ఉన్న డీకేటీ స్థలంపై సర్వే నెంబరు155లో 5 సెంట్ల భూమిపై గత కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. అయితే మంజునాథ్ గడ్డివామికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించడంతో కాలిబూడిదైంది. ఈ ప్రమాదంలో లోద్దు గడ్డికాలినట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాల్మీకిపురం : పట్టణంలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ జాకీర్ తెలిపారు. 33 కేవీ వాల్మీకిపురం ఫీడర్ సబ్ స్టేషన్ పరిధిలో మెయిన్‌టెనెన్స్ కోసం వాల్మీకిపురం, చింతపర్తి, గండబోయనపల్లి, కూరపర్తి పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రాగిజావ పంపిణీ

మదనపల్లె సిటీ : స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్దనున్న చిల్డ్రన్స్ హోంలో శనివారం వైడ్స్ సంస్థ వ్యవస్థాపకులు బి.మాధవి రాగిజావ పంపిణీ చేశారు. పిల్లలకు చిరుధాన్యాలతో తయారు చేసిన జావాను నెల రోజుల పాటు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో జావా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.

అత్యుత్తమ ఫలితాలు.. 'ఆదర్శ' పాఠశాల

- ప్రశంసలందుకొంటున్న మోడల్ స్కూల్ విద్యార్థులు
- 500 పైగా మార్కులు సాధించిన 21 మంది
- పీఎం శ్రీ పథకానికి ఎంపికైన కేవీపల్లె మోడల్‌స్కూల్
- ఆరో తరగతి ప్రవేశానికి 25 వరకు గడువు


కేవీపల్లె ఏపీ మోడల్ స్కూల్


మోడల్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ గిరీషా

కేవీపల్లె : చదువు వ్యాపారంగా మారిన తరుణంలో ప్రయివేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో 2013లో ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలలు (ఏపీ మోడల్ స్కూల్స్) ప్రారంభించారు. లక్ష్యానికి తగ్గట్లుగానే పేద విద్యార్థులకు ఇంగ్లిషు మీడియంలో నాణ్యమైన విద్యనందించడానికి ఆదర్శ పాఠశాలలు కృషి చేస్తున్నాయి. ఏడాదికేడాది కేవీపల్లె ఏపీ ఆదర్శ పాఠశాల పదో తరగతి, ఇంటర్మీడియట్ అత్యుత్తమ ఫలితాలు సాధించి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలిచింది. పదో తరగతి ఫలితాల్లో విశేష ప్రతిభ చూపిన కేవీపల్లె మోడల్ స్కూల్‌విద్యార్థులకు జిల్లా కలెక్టర్ గిరీషా నుంచి అభినందనలు లభించాయి. కేవీపల్లె పాఠశాలలో వివిధ ప్రత్యేకతలు మెరుగైన సౌకర్యాలు, అధ్యాపకుల కృషి ఉత్త ఫలితాల సాధనకు దోహదపడ్డాయి.

ఉత్తమ మార్కులు సాధించిన 21 మంది విద్యార్థులు

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కేవీపల్లె ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల్లో 21 మంది 500పైగా మార్కులు సాధించిన విశేష ప్రతిభ కనబరిచారు. ఇందులో డి. సౌమ్యశ్రీ 586 మార్కులతో మోడల్ స్కూల్స్‌లో జిల్లాలో రెండోస్థానం సాధించింది. అలాగే కె. రెడ్డి భవ్యశ్రీ 571, ఎ. మునిప్రసన్న 570, కె. రుచిత 565 మార్కులతో రాణించారు. అలాగే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎ. వర్షిత 979, పి. రక్షిత 967, ఎ. నిఖిత్‌కుమార్ 966 మార్కులతో రాణించారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా మోడల్ స్కూల్ విద్యార్థులు ఫలితాలు సాధిస్తున్నారు.

పీఎంశ్రీ పథకానికి ఎంపిక

ప్రైమ్‌మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకానికి కేవీపల్లె మోడల్ స్కూల్ ఎంపికైంది. అన్నమయ్య జిల్లాలో మొత్తం 28 పాఠశాలలు పీఎం శ్రీకి ఎంపిక కాగా అందులో కేవీపల్లె ఆదర్శ పాఠశాల ఒకటి. దీంతో పాఠశాలకు మౌలిక సదుపాయల కల్పనకు ప్రతి ఏటా రూ. 30 లక్షలు చొప్పున ఐదు సంవత్సరాలు పాటు అందనున్నట్లు ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ తెలిపారు. ఈ నిధులతో పాఠశాలలో డిజిటల్ తరగతులు, అభ్యసనా సామగ్రి, గ్రంథాలయం, తరగతి గదుల నిర్మాణం, క్రీడామైదానాల అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

కేవీపల్లె మోడల్ స్కూల్ ప్రత్యేకతలు

ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్య అందుబాటులోఉంది. ఉన్నత విద్యార్హత, అనుభవం కల్గిన ఉపాధ్యాయులచే కృత్యాధార పద్ధతిలో బోధన ఉంటోంది. పాఠశాలలో విశాలమైన లైబ్రరీ, కంప్యూటర్ విద్యపై శిక్షణ, వ్యాయామ తరగతులు, అధునాతన పరికరాలతో సైన్స్ ల్యాబ్, వృత్తి విద్యా శిక్షణా తరగతులు ఉన్నాయి. 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం ఉంది.

ఆరో తరగతి ప్రవేశానికి ఈ నెల 25వ వరకు గడువు

ఏపీ మోడల్‌స్కూల్ నందు 2023–24 విద్యా సంవత్సరం ఆరో తరగతి ప్రవేశానికి ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉన్నట్లు ప్రిన్సిపాల్ రెడ్డిప్రదీప్ తెలిపారు. 5వ తరగతి చదివిన ఓసీ, బీసీ విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగష్టు 31 లోపు జన్మించి ఉండాలని చెప్పారు. అలాగే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2009 సెప్టెంబర్ 1 నుంచి 2013 ఆగష్టు 31 లోపు జన్మించి ఉండాలని చెప్పారు. జూన్ 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు ప్రత్యేక చొరవ



ఏపీ మోడల్ స్కూల్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ నందు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక చొరవ చూపుతున్నాం. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తమ పాఠశాల నందు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యా తోపాటు కంప్యూటర్, వృత్తి విద్య శిక్షణ, వ్యాయామ తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఏపీ మోడల్ స్కూల్ సద్వినియోగం చేసుకోవాలి.

- రెడ్డిప్రదీప్, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, కేవీపల్లె

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడండి

మదనపల్లె సిటీ: రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓంప్రకాష్ అన్నారు. శనివారం స్థానిక ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ మదనపల్లె శాఖ ఆధ్వర్యంలో రవిశంకర్ జన్మదినం పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.ఆయన మాట్లాడుతూ రక్తదానం ఒక మనిసి జీవితాన్ని రక్షించే ఉన్నతమైన సేవ అని తెలిపారు. సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ కో ఆర్డినేటర్ క్రాంతి, శిక్షకులు రాజా, నాగలక్ష్మి, నారాయణరెడ్డి, ఖగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు వీఆర్వోగా రాజగోపాల్

కురబలకోట : మండలంలోని ముదివేడు వీఆర్వోగా రాజగోపాల్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడున్న వీఆర్వో వేణుగోపాల్ రెడ్డిని డిప్యుటేషన్‌పై నిమ్మనపల్లె మండలం బండ్లపై గ్రామానికి బదిలి చేశారు. అతని స్థానంలో అక్కడున్న వీఆర్వో రాజగోపాల్‌ను ముదివేడుకు బదిలీ చేశారు. వివిధ ప్రజా సమస్యలపై వచ్చే వారికి సత్వరం పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

మదనపల్లె సిటీ : మాతృమూర్తుల దినోత్సవం పురస్కరించుకున ఆదివారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానశిబిరం ఏర్పాటు చేసినట్లు వెల్ విషర్స్ వ్యవస్థాపకులు గిరీష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఆస్పతిలోని బ్లడ్ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో రక్తదాతలు రక్తదానం చేయాలని కోరారు.

పథకాల అమలులో వలంటీర్లే కీలకం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

ములకలచెరువు : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల పాత్ర కీలకమని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవన సముదాయంలో మండలంలోని వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2024లో కూడా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా మనమంతా కలసి కట్టుగా శ్రమిద్దామని పిలుపు నిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వైఎస్ జగన్ రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థ అమలు చేసి అర్హతే ప్రామాణికంగా పథకాలను లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు చేపట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. ఏపీ పాలనా తీరు విధానంపై పక్క రాష్ట్రాల పాలకులు సైతం అధ్యయనం చేసి వారి రాష్ట్రాల్లో కూడా అమలు చేసే ఆలోచనలో ఉండటం జగన్ సువర్ణ పాలనకు నిదర్శనమన్నారు. రాజకీయ ఆవిర్భావం నుంచి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్ల నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసామన్నారు. ఇంటింటికీ ఫ్లోరైడ్ రహిత మంచినీరు అందించే దిశగా చర్యలు ముమ్మరం చేస్తున్నామన్నారు. అదే విధంగా శిథిలావస్థకు చేరుకున్న పురాతన ఆలయాలకు కూడా రూ.కోట్ల నిధులు వెచ్చించి వాటి రూపు రేఖలు మార్చేలా చర్యలు చేపడుతున్నామన్నారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని నారా లోకేష్ వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని ఓర్వలేక టీడీపీ ఉనికి కాపాడుకునేందుకు దిగజారుడు ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. రాబోవు కాలంలో పరిశ్రమల ఏర్పాటును దృష్టిలో ఉంచుకుని నియోజకవర్గానికి కొత్త విద్యుత్ సబ్ స్టేషన్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. సమావేశంలో ఎంపీపీ సాయిలీల, జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ మాధవరెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ ఏవీ గౌరీశంకర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రవీంద్రరెడ్డి, ఆర్‌బీకే ఛైర్మన్ వెంకటేశ్వరరెడ్డి, పద్మశాలి రాష్ట్ర డైరెక్టర్ సురేంద్రనాథ్‌తో పాటు సర్పంచ్‌లు రహమత్‌బీ, జయచంద్ర, విష్ణు, ఎంపీటీసీలు రేష్మా, ఆయిషా, నాయకులు రవీంద్రరెడ్డి, సదా శివప్ప, విశ్వనాథ్, కిషోర్, రామనాథ్, సురేంద్ర గౌడ్, సిద్దారెడ్డి, రఫి, చాంద్‌బాషా పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం


గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మున్సిపాలిటీలో పూర్తి అయిన సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలను అందించడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 35వ వార్డులో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్‌ఛైర్మన్ జింకాచలపతి, కౌన్సిలర్ ఎస్వీ.రమణ ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలుకరించారు. వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని తెలియజేశారు. స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకుని, వాటిని అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పలువురు తమకు విద్యాదీవెన పథకం అందలేదని, ఇళ్ల పట్టా మంజూరు చేసినప్పటికీ స్థలం చూపించలేదని, పెన్షన్ ఇప్పించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని తక్షణమే పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. గత ఏడాది మే 15న మదనపల్లె మున్సిపాలిటీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. సంవత్సర కాలంగా పట్టణంలోని 35 వార్డుల్లో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నామన్నారు. ఎక్కడకు వెళ్లినా ప్రతిచోట ప్రజలు ఘనస్వాగతం పలుకుతూ, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి జగనన్న పాలనపై సంతృప్తి వ్యక్తం చేయడం సంతోషాన్నిచ్చిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్.జగన్‌కు ప్రజలందరూ మద్దతు ప్రకటించి మరోసారి సీఎంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.

పండుగ వాతావరణంలో ముగింపు వేడుక

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మదనపల్లె మున్సిపాలిటీలోని 35వార్డుల్లో విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా నీరుగట్టువారిపల్లె కాట్లాటపల్లె రోడ్డు ఆంజనేయస్వామి గుడివద్ద వైఎస్సార్ సీపీ నాయకులు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముగింపు వేడుకలను తెలిపేలా..మున్సిపల్ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు బండిమనోహర్ వేర్వేరుగా కేకలను తెప్పించి ఎమ్మెల్యే చేతుల మీదుగా కట్‌చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఆర్వో పల్లవి, డీఈ శిరీషా, ఏఈ స్నేహప్రియ, కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, వసీం, రేణుక, రామిశెట్టిశివయ్య, ఈశ్వర్‌నాయక్, ఎం.వి.రమణ, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, శీలంరమేష్, దండురామాంజులు, వెలుగుచంద్ర, రహీం, ఎల్ఐసీ.సుధాకర్, పోతబోలునాగరాజ, జాన్‌బాబు, రెడ్డిశేఖర్, మునిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అశాస్త్రీయ భావజాలాన్ని అడ్డుకుందాం


మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న

మదనపల్లె సిటీ : విద్యారంగంలో అశాస్త్రీయ భావజాలాన్ని అడ్డుకుందామని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న అన్నారు. శనివారం స్థానిక సీటీఎం సమీపంలోని ప్రకృతివనంలో ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. శాస్త్రీయ భావజాలాన్ని అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వం మూఢనమ్మకాలను ప్రోత్సహించే విధంగా పాఠ్యాంశాలను మార్చాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని ఆరోపించారు. కుటిల ప్రయత్నాలను మానుకోకపోతే విద్యార్థులు ఏకమై భవిష్యతుత పోరాటాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. చదువు పోరాడు చదువుకై నినాదంతో ఎస్ఎఫ్ఐ ముందుకు వెళ్లతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నాగరాజు,అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, నరసింహ, రమణ, నిరంజన్, వెంకట్, జయప్రకాష్ పాల్గొన్నారు.

ఉపాధి పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయండి

మదనపల్లె : నిరుపేదల జీవనోపాధికి నిర్దేశించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని(ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) నియోజకవర్గంలో మరింత సమర్థవంతంగా అమలుచేస్తూ గరిష్టస్థాయిలో కూలీలకు పనిదినాలు కల్పించాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం పనుల నిర్వహణపై జిల్లా నీటియాజమాన్య సంస్థ పీడీ మద్దిలేటి ఆధ్వర్యంలో మదనపల్లె నియోజకవర్గ సమీక్షా సమావేశం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే నవాజ్‌బాషా నియోజకవర్గంలో ఉపాధిహామీ పథకం ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే, జూన్, జూలై ఉపాధిహామీ పనులకు విస్తృత అవకాశాలున్న నేపథ్యంలో కూలీలకు వీలైనన్ని పనిదినాలు కల్పించేందుకు ఫీల్డ్ అసిస్టెంట్లు కృషిచేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించవచ్చన్నారు. ప్రతి కుటుంబానికి 100 దినాలు పని కల్పించి, రూ.27,200 ఆర్థిక భరోసా ఇవ్వాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, మధుబాబు, చందన, ఎంపీడీఓలు లీలామాధవి. తాజ్‌మస్రూర్, సురేష్‌బాబు, ఏపీఓ సుబ్రహ్మణ్యం, గౌరీశంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం : స్థానిక తరిగొండ రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ గురుకుల మైనార్టీ బాలికల పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి గానూ 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశాలకు మైనార్టీ బాలికలు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ ఏఆర్ మంజుల తెలిపారు. 5వ తరగతిలో 61, 6వ తరగతిలో 51, 7వ తరగతిలో 32, 8వ తరగతిలో 26 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. మైనార్టీ విద్యార్థినీలు ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకొని ఏపీ గురుకుల పాఠశాల (మైనార్టీ బాలికలు), తరిగొండ రోడ్డు, వాయల్పాడు పోస్టు, మండలం, అన్నమయ్య జిల్లా, 517299 అడ్రస్సుకు రిజిస్టర్ పోస్టు ద్వారా గానీ, లేదా నేరుగా గానీ జూన్ 30వ తేదీ లోపు అందించవచ్చునన్నారు. వివరాలకు 9866559649ను సంప్రదించాలని ఆమె కోరారు.

జిల్లేళ్లమంద తండాలో చర్చి నిర్మించరాదు

కేవీపల్లె : మండలంలోని జిల్లేళ్లమంద సుగాలితండాలో చర్చి నిర్మించరాదని సర్పంచ్ కృష్ణవేణి అన్నారు. శనివారం గ్రామస్తులతో కలసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సుమారు 200 కుటుంబాల్లో 1600 మంది జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. మొత్తం బంజారా (ఎస్టీ)కులానికి చెందిన వారని పేర్కొన్నారు. అయితే బయటి వ్యక్తులు గ్రామంలో చర్చి నిర్మాణం ప్రారంభించారని, ఇది బంజారా సంస్కృతిపై ప్రభావం చూపుతుందని తెలిపారు. తక్షణం చర్చినిర్మాణ పనులు ఆపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బంజారా సంఘం జిల్లా అధ్యక్షులు అమ్లు నాయక్, విశ్వహిందూ పరిషత్ నాయకులు సుబ్బయ్య, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ప్రభుత్వ సాయం


జయరాజ్ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అందించిన రూ.లక్ష చెక్కును శనివారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా అందజేశారు. మండలంలోని పోతపోలు పంచాయతీ తురకపల్లెకు చెందిన జయరాజ్ మార్చి 9న ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారు. ఇతడికి అనూష, సుమిత్ర, సునీల్ ముగ్గురు పిల్లలు ఉన్నారు. తండ్రి మరణంతో కుటుంబపోషణ కష్టంగా ఉంటోందని పిల్లలు ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు వినతిచేశారు. దీంతో స్పందించిన ఎంపీ, ఎమ్మెల్యేలు జిల్లా కలెక్టర్ గిరీషా దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ప్రభుత్వం తరఫున రూ.లక్ష ఆర్థికసహాయం మంజూరుచేశారు. చెక్కును మండల ఎఫ్ఏసీ తహసీల్దార్ బావాజాన్ సమక్షంలో ఎమ్మెల్యే నవాజ్‌బాషా జయరాజ్ కూతురు అనూష, కుమారుడు సునీల్‌కు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నూర్‌ఆజం, వైఎస్సార్ సీపీ నాయకులు పోతపోలునాగరాజ, కొండామారిపల్లె ఇస్మాయిల్, వీఆర్వో మాధవరెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై సంబరాలు

పీలేరు : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో విజయవం సాధించడంపై పీలేరు పట్టణంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్‌తేజ మాట్లాడుతూ కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం బీజేపీ పతనానికి నాంది అని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పాదయాత్రను ప్రజలు స్వాగతించారని తెలిపారు. కేంద్రంలో బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలే బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపే రోజులు దగ్గరపడ్డాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు సాయి సంపత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె సిటీ : కర్ణాటక రాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ ఓటమికావడంపై మదనపల్లె పట్టణంలో శనివారం వీసీకే పార్టీ సంబరాలు నిర్వహించారు. థ్యాంక్యూ కర్ణాటక అంటూ ప్లకార్డులు ప్రదర్శించి, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీసీకె పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీఎం శివప్రసాద్ మాట్లాడుతూ అత్యంత విషతుల్యమైన బీజేపీ ప్రభుత్వాన్ని బొందపెట్టి కర్ణాటక ప్రజలు దేశానికి మహోపకారం చేశారని తెలిపారు. వీసీకే పార్టీ కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు కోసం ప్రచారం చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, పీర్‌బాషా, మనోహర్, రవిశంకర్,న రెడ్డప్ప,సూర్య రెడ్డిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారంలో రాజీయే రాజమార్గం


వాల్మీకిపురం: కోర్టులో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి శిరీష్


పీలేరులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్


మదనపల్లెలో కేసులు పరిష్కరిస్తున్న జడ్జి శ్రీదేవి

వాల్మీకిపురం : రాజీమార్గంతోనే దీర్ఘకాలిక కేసులకు పరిష్కారం దొరుకుతుందని, తద్వారా కక్షిదారులకు కేసుల నుంచి ఉపసమనం పొందవచ్చునని జడ్జి శిరీష్ అన్నారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా సివిల్, క్రిమినల్, బ్యాంకు కేసులకు సంబంధించి 97 కేసులను ఒకే రోజులో పరిష్కరించారు. తద్వారా రూ.8,27,003 నగదును రికవరీ చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆనంద్ కుమార్, న్యాయవాదులు అశోక్ కుమార్ రెడ్డి, ద్వారకనాథ రెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

158 కేసులు పరిష్కారం

పీలేరు రూరల్ : స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 158 కేసులు పరిష్కారం అయినట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీనివాసులు నాయక్ తెలిపారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్ కేసులను కక్షిదారులు రాజీమార్గంలో పరిష్కరించుకున్నట్లు తెలిపారు. వివిధ కేసులకు సంబంధించి రూ. 69,69,857 రికవరీ అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీపీ శారద, సీఐ మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు అన్సారీ, న్యాయవాదులు పాల్గొన్నారు.

79 కేసులు పరిష్కారం

మదనపల్లె : మదనపల్లె న్యాయస్థాన ప్రాంగణంలో శనివారం జరిగిన జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో 79 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో క్రిమినల్ కేసులు 66, సివిల్‌కేసులు 11, మోటార్ వెహికల్‌యాక్ట్ కేసులు రెండు, ఇరువర్గాల ఆమోదంతో పరిష్కరించారు. బాధితులకు నష్టపరిహారంగా రూ.1,87,03,070లు అందజేశారు. ఈ సందర్భంగా రెండవ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లతో బాధితులకు సత్వర న్యాయం అందడంతో పాటూ సమయం, నగదు ఆదా అవుతుందన్నారు. రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలవారు కేసు గెలిచినట్టేనని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.వెంకటేశ్వర్లు నాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మంజులత, న్యాయవాదులు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటివద్దకే వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

కలికిరి : ఇంటింటికే వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని డీపీఎంఓ డాక్టర్ లోకవర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని మేడికుర్తి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో దూదేకులపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ క్యాంప్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులు నేరుగా గ్రామానికే వచ్చి బీపీ, షుగర్ పరీక్ష చేయడం తోపాటు అప్పటికప్పుడే మందులు ఇస్తున్నట్లు తెలిపారు. గర్భవతులకు పరీక్షలు చేసి వారికి సూచనలు, సలహాలు ఇస్తున్నట్లు చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారికి ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు వరంలాంటివని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈ మహ్మద్ రఫీ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ఏఎన్‌ఎం జయంతి తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా


మిట్స్ అశ్వ ఫెస్టివల్‌లో అతిథులు

కురబలకోట : మండలంలోని అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అశ్వ–23 జాతీయ కల్చరల్ ఫెస్టివల్‌లో శనివారం రాత్రి విద్యార్థులు వివిధ డ్యాన్సులు, ఆటపాటలతో అలరించారు. గాయకులు అరుణ్ కౌండిల్య, శృతి రంజని, శాండిల్య పాటలతో ఆకట్టుకున్నారు. జబర్దస్త్ అభినయ్, కృష్ణ పంచ్ డైలాగులతో రంజింపజేశారు. అనంతరం ఆటలపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ కీర్తి నాదేళ్ల, కె.శశిర్, ఆర్ఆర్ ఆర్ అకాడమీ అధ్యక్షులు నాదేళ్ల ద్వారకనాద్, కన్వీనర్ సమీనా తదితరులు పాల్గొన్నారు.